

## 30 వరకే నవోదయ దరఖాస్తుల స్వీకరణ

కామారెడ్డి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్‌లో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 9వ తరగతి, 11వ తరగతిలో చేర్చుకొనుటకు నిర్వహించే ప్రవేశపరీక్ష దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 30 వరకు మాత్రమే అవకాశం ఉందని డీఈవో రాజు తెలిపారు. దరఖాస్తులు సమర్పించుటకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.నవోదయ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్‌ని సందర్శించాలని తెలిపారు.




## ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం

# నిరీక్షణ

కామారెడ్డి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత రెండేళ్లుగా ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత విద్యా సంవత్సరం ముగిసి ఇతర కోర్సుల్లో ప్రవేశించేందుకు సర్టిఫికెట్ల కోసం ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతున్నాయి. ఫీజులు కడితే కాని సర్టిఫికెట్లు ఇవ్వమని తెగేసి చెబుతున్నారు. జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి రూ.20.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో ఇటు విద్యార్థులు అటు కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాల యాజమాన్యాలు బంద్ ప్రకటిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

- విద్యార్థులకు అందని స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్
- రెండేళ్లుగా విడుదల కాని బడ్జెట్
- జిల్లాలో 20.50 కోట్లకు పైగా బకాయిలు
- ఇబ్బందులు పడుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు
- కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల నుంచి ఫీజు వసూళ్లు
- ఆందోళనకు దిగుతున్న ప్రైవేట్ కళాశాలలు

### గత రెండేళ్లుగా అందని ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు

జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై సుమారు 10 నుంచి 15 వేల మంది విద్యార్థులు ఆధారపడి ఉన్నత చదువులు చదువుతున్నారు. రెండేళ్ల నుంచి ప్రభుత్వం ఫీజులను చెల్లించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి బీసీ, ఈబీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో సుమారు 12వేల మంది బీసీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో 10వేల మందికి పైగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రైవేట్ కళాశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి గత రెండేళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదు. రూ.13కోట్ల వరకు బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్సీ విద్యార్థులకు ఏడాది కాలంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. 3120 మంది విద్యార్థులకు రూ.3.40 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఎస్టీ విద్యార్థులకు సంవత్సరం కాలంగా పెండింగ్‌లో ఉండగా వీరికి సుమారు రూ.2.10కోట్లు 2,627 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కావాల్సి ఉంది. వీరికే కాకుండా మైనార్టీ విద్యార్థులకు సైతం రూ.2కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

### ప్రతిపాదనలు పంపినా విడుదల కాని బడ్జెట్

కామారెడ్డి జిల్లాకు చెందిన ఆయా సంబంధిత శాఖల అధికారులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా బడ్జెట్ విడుదల కావడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని మెలికలు పెడుతున్నారు. అలాగే విద్యార్థులకు నెల నెల చెల్లించే స్కాలర్‌షిప్ సొమ్మును కూడా విడుదల చేయడం లేదు. జిల్లాలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, బీఈడీ, డీఎడ్, ఇంజనీరింగ్, నర్సింగ్, బీ ఫార్మసీ తదితర కోర్సులకు సంబంధించి కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలు సైతం ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు నిర్దేశించిన మేరకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తోంది. ప్రభుత్వం ఇచ్చే ఫీజు కంటే ఎక్కువ ఉన్న మొత్తాన్ని విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుంది. మెస్‌చార్జీల కింద కోర్సులను బట్టి స్కాలర్‌షిప్ ఇస్తారు. ఈ సొమ్మును నెలనెల కాకుండా ఒకేసారి విద్యార్థుల ఖాతాలో జమ చేస్తారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు కేవలం స్కాలర్‌షిప్ డబ్బులను మాత్రమే వారి ఖాతాలో జమ చేస్తారు.

### ఆందోళన చెందుతున్న విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలలు

రెండేళ్ల నుంచి ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు రాక ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు తంటాలు పడుతున్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో ఆయా ప్రైవేట్ కళాశాలలు ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. కళాశాలలు బంద్ ప్రకటిస్తూ నిరసన చేపడుతున్నారు. కొన్ని కళాశాలల్లో యాజమానులు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని సమాచారం. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి మాత్రం కాగితాలు రాయించుకుని ఫీజు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను విడుదల చేసిన తర్వాత తిరిగి తమకు చెల్లిస్తామని చెబుతున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. రెండు విద్యా సంవత్సరాలు ముగిసిన కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులతో పాటు స్కాలర్‌షిప్ డబ్బులు విడుదల చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఆయా పథకాలకు బడ్జెట్‌ను మళ్లించడంతో ఫీజులు విడుదల కావడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ డబ్బులను విడుదల చేయాలని విద్యార్థులు, ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు కోరుతున్నాయి.



## లక్ష్యానికి అనుగుణంగా పంట రుణాలను మంజూరు చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్




సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక పంట రుణాలు లక్ష్యానికి అనుగుణంగా ఎక్కువగా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జూన్ త్రైమాసికానికి అంతమయ్యే జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు మరింత ఎక్కువగా మం జూరు చేయాలని అన్నారు. సూక్ష్మ, మధ్యకాలిక రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇతర ప్రాధాన్యత రుణాలు అయినటువంటి విద్యారుణాలు, ఇంటి రుణాలు, సామాజిక మౌలిక సదుపాయాల రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ మహిళా సంఘాలకు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించా రు. బ్యాంకు లింకేజీ మొండి బకాయిలు ఒక ప్రణాళికబద్ధంగా సమీక్షించి వసూలు చేయాలని గ్రామీణాభివృద్ధి, మెప్మా అధికారులకు సూచించారు. షెడ్యూల్ కులాలు, తెగల లబ్ధిదారులకు గతంలో సబ్సిడీ మంజూరు అయి బ్యాంకు ఖాతాల్లో జమ అయిన లబ్ధిదారుని యూనిట్లను యుద్ధప్రాతిపదికన గ్రౌండింగ్ చేయాలని తెలిపారు. వివిధ కారణాల వల్ల దేవునిపల్లి, వాజిద్‌నగర్, మిర్జాపూర్, కామారెడ్డి గంజ్ నిజామాబాద్ జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచీ లను కామారెడ్డి, బిచ్కుంద, బీర్కూర్, కామారెడ్డి బ్రాంచీల్లో విలీన ప్రక్రియ గురించి సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.జడ్ రెహమాన్, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికాంత్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, జిల్లా షెడ్యూల్ సంక్షేమాధికారిని రజిత తదితరులు పాల్గొన్నారు.

## గ్యార్వీ ఉత్సవాలకు హాజరైన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

లింగంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన గ్యార్వీ ఉత్సవాలకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి కవ్వాలి ఉత్సవాల్లో పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన హైకోర్టు న్యాయవాది మోహిన్ అహ్మద్ ఖద్రి నిర్వహించిన గ్యార్వీ పండుగకు కామారెడ్డి జిల్లాలోని మత పెద్దలతో పాటు నిజామాబాద్, బోధన్, మహారాష్ట్ర, హైదరాబాద్ ప్రాంతాల నుంచి మత పెద్దలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం ఉదయం వరకు కవ్వాలి ఉత్సవాలు నిర్వహించారు.



లింగంపేటలో గ్యార్వీ ఉత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ




ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ కార్యాలయం

- సాగు నీటి సంఘాల ఎన్నికల కోసం ఎదురు చూపులు
- సంఘాలతో చెరువుల బలోపేతం
- 2008లో చివరి సారిగా ఎన్నికలు
- గతంలో ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో 73 సంఘాలు
- కాంగ్రెస్ హయాంలో ఎన్నికల నిర్వహణపై చిగురిస్తున్న ఆశలు

# నీటి మూటలుగానే.. సాగు నీటి సంఘాలు!

ఎల్లారెడ్డి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చెరువులు, కుంటల అభివృద్ధికి ఎంతో దోహదపడే సాగునీటి సంఘాలకు చాలా కాలంగా ఎన్నికలు నిర్వహించడం లేదు. 2008లో చివరి సారిగా సాగు నీటి వినియోగదారుల సంఘానికి ఎన్నికలు జరిగాయి. 2014లో తెలంగాణ ఏర్పాటు అయ్యాక అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తుందని రైతులు భావించారు. కానీ వాటి జోలికి వెళ్లని ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద చేపట్టిన పనులు కాంట్రాక్టర్లకు అప్పగించింది.

### 1997లో మొదలై 2008లో ఆగాయి

నీటి పారుదల రంగంలో రైతుల భాగస్వామ్యం పెంచేందుకు 1997లో టీడీపీ ప్రభుత్వం సాగు నీటి సంఘాల ఏర్పాటు చేసింది. ఆరేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించి సంఘాల ద్వారా చెరువుల అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత విధానాల్లో మార్పులు చేసింది. ప్రతీ రెండేళ్లకు ఒకసారి 1/3వ వంతు పాలక వర్గ సభ్యులకు ఎన్నికలు నిర్వహించి రెండేళ్ల పదవీ కాలం ముగిసే సభ్యులకు మాజీలను చేయాలని నిర్ణయించింది. ఈ ప్రకారం 2006, 2008 సంవత్సరంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. 2010 జనవరి 1/3వ వంతు పద్ధతిలో జరగాల్సిన ఎన్నికల వాయిదా పడింది. తెలంగాణ ఉద్యమం రాజకీయ పరిస్థితుల దృష్ట్యా నిర్వహణకు ప్రభుత్వం సుముఖత చూపలేదు. 2011 జనవరిలోనైనా నిర్వహిస్తుందని రైతులు ఆశతో ఎదురు చూడగా సంఘాల ఎన్నికలు వాయిదా వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి సాగు నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు లేకుండా పోయాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మళ్లీ సాగునీటి సంఘాల ఎన్నికలపై ఆశలు చిగురిస్తున్నాయి.

### సబ్ డివిజన్‌లో 73 సాగు నీటి సంఘాలు

ఎల్లారెడ్డి సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 73 సాగు నీటి వినియోగదారుల సంఘాలను ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసింది. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట్, గాంధారి, తాడ్వాయి, సదాశివనగర్ మండలాల్లో మొత్తం కలిపి 73 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. గతంలో కాలువల మరమ్మతులు చెరువు, కుంటల అభివృద్ధి పనులు కమిటీ దగ్గర ఉండి చేయించారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి సంఘాల ఎన్నికలు తెరపైకి వచ్చింది. దీంతో గ్రామాల్లో సాగునీటి ఎన్నికలపై చర్చ జోరుగా సాగుతోంది.

### ఎల్లారెడ్డి నియోజకవర్గంలో..

#### ప్రభుత్వం దృష్టి సారించాలి

- పి.హన్మయ్య, సాగునీటి సంఘం మాజీ టీసీ



సాగునీటి సంఘాలు అంటేనే చెరువులకు రక్షణ చెరువులు, కాలువలు మరమ్మతులకు పనులు చేపట్టే వాళ్లం. చాలా ఏళ్లుగా సంఘాలకు ఎన్నికలు లేకుండా పోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చెరువులు, కుంటల బలోపేతానికి చర్యలు తీసుకోవాలి.

#### ఆక్రమణకు అడ్డుకట్ట

- గజేల్లి రాంచందర్, సాగునీటి సంఘం మాజీ చైర్మన్



సంఘాల ఏర్పాటుతో చెరువులు, కాలువలు, ఆక్రమణ కాకుండా చూసుకునే బాధ్యత కమిటీలకు ఉంటుంది. వాటికి పూర్తి రక్షణ కల్పించే అవకాశం కలుగుతుంది. ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలపై మంచి నిర్ణయం తీసుకుని సంఘాలే ఏర్పాటు చేయాలి.



వెంకంపల్లి శివారులో మంజీరా నదిపై నిర్మించిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్

## వెంకంపల్లి బ్రిడ్జిని పరిశీలించిన ఎల్లారెడ్డి ఆర్డీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాగిరెడ్డిపేట, అక్టోబరు 16: మండలంలోని వెంకంపల్లి శివారులోని మంజీరా నదిపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. 'తాండూర్ - ముద్దాపూర్ రోడ్డు నిర్మాణం పూర్తయ్యేనా?' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్‌లు స్పందించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి వెంకంపల్లి శివారులో మంజీరా నదిపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జి నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సహకారంతో ఆగిపోయిన రోడ్డు నిర్మాణం పనులు త్వరగా ప్రారంభించి త్వరలో పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అనంతరం ఆర్డీవో పోచారం ప్రాజెక్టులను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యం, తాండూర్ సొసైటీ అధ్యక్షుడు ఆకిడి గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు బాబురావు, కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

# బెజ్జోరలోని కప్పలవాగులో విచ్చలవిడిగా అక్రమ ఇసుక రవాణా

● కామారెడ్డి, హైదరాబాద్‌కు తరలిస్తున్న ఇసుక


ఇసుకను తోడేస్తున్న దృశ్యం(ఫైల్)

భీమ్‌గల్‌రూరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజ్జోర గ్రామంలోని కప్పలవాగులో విచ్చలవిడిగా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారు. రాత్రి అయిందంటే చాలు వాగులో జాతరగా ఉంటుంది. ఇసుక మాఫియా ట్రాక్టర్‌లతో వాగు నుంచి ఇసుకను తీసుకొచ్చి అక్కడే ఉన్న ఇసుక బట్టి వద్ద డంప్ చేస్తారు. డంప్ చేసిన ఇసుకను జేసీబీతో పెద్ద లారీల్లో టిప్పర్‌లతో టారాస్‌లో లోడ్ చేసి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారు. ఇసుక రోజు 20నుంచి 30లారీల ఇసుకను కామారెడ్డి, హైదరాబాద్ వంటి పట్టణాలకు ఇసుక తరలిస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. లారీల్లో ఇసుకను నింపి ఎవరికి అనుమానం రాకుండా పైనా తాటిపత్రి కప్పి ముచ్కూర్ నుంచి సిరికొండ మీదుగా కామారెడ్డి హైవేకు చేరవేసి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నారు. దీంతో భారీ మొత్తంలో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. ఇంత పెద్ద తతంగం జరుగుతున్న రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడంలేదని ఈ అక్రమ ఇసుక రవాణా వారి కనుసన్నల్లోనే జరుగుతుందని పలువురు ఆరోపిసన్తున్నారు. మండలం నుంచి లారీల్లో ఇసుకను తరలించడం ఇదే మొదటిసారి అని ఈ అక్రమ ఇసుక రవాణాకు అపకుంటే భవిష్యత్‌లో భూగర్భజలాలు తగ్గి నీటి ఎద్దడి తలెత్తుతుందని పలువురు ఆవేదన చెందుతున్నారు. పది రోజుల క్రితం అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో అధికారులకు ఇసుక తరలిస్తున్న విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో లారీని సీజ్ రెవెన్యూ అధికారులకు అప్పజెప్పడంతో తహసీల్దార్ వాల్యా చట్టం ప్రకారం తదుపరి చర్యల కోసం భూగర్భ గనుల శాఖ అధికారులకు అప్పజెప్పారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి బెజ్జోర గ్రామంలోని కప్పలవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## బీటీరోడ్డు నిర్మాణానికి రూ.3కోట్ల 68లక్షల నిధుల మంజూరు


మాట్లాడుతున్న బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిపల్లి గ్రామం నుంచి ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామం వరకు నూతనంగా నిర్మించనున్న బీటీరోడ్డు నిర్మాణానికి రూ.3కోట్ల 68లక్షల నిధులు మంజూరైనట్టు బీజేపీ నాయకులు తెలిపారు. బుధవారం జక్రాన్‌పల్లి బీజేపీ కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు పి.తిరుపతిరెడ్డి, గుత్ప లిఫ్ట్ సాధన కమిటీ చైర్మన్, బీజేపీనాయకుడు వాకిల్ గంగారెడ్డి, గిరిజనమోర్చ జిల్లా అధ్యక్షుడు కిసాన్‌నాయక్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మునిపల్లి గ్రామం నుంచి అంకాపూర్ గ్రామం వరకు నూతనంగా నిర్మించనున్న సుమారు 3.20కిలోమీటర్ల నూతన బీటీరోడ్డు నిర్మాణానికి రూ.3కోట్ల 68లక్షల సీఆర్‌ఆర్ గ్రాంటు నిధులను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మంజూరు చేయించినట్టు తెలిపారు. నిధులు మంజూరు చేసిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి మునిపల్లి, అంకాపూర్, జక్రాన్‌పల్లి మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల గ్రామాల ప్రజలు 50ఏళ్ళ కల నెరవేరిందన్నారు. ఈ సమావేశంలో మండల బీజేపీ కిసాన్‌మోర్చ అధ్యక్షుడు పి.తిరుపతిరెడ్డి బీజేపీ నాయకులు సంతోష్ కుమార్, గాజుల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


దేవతామూర్తులకు డోలోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి ఏడో పోలీస్ బెటాలియన్ పక్కనగల శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో వెంకటేశ్వరస్వామి సహిత శ్రీదేవి, భూదేవి విగ్రహాలకు వేదబ్రాహ్మణులు వసంతోత్సవం, డోలోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఆలయ నిర్మాణకర్త శ్రీనివాస్‌రెడ్డి, బెటాలియన్ అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నేడు ఆలయ ప్రాంగణంలో ఆరాధన, బలిహరణము, చక్రదర్శనము, రథోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు తెలిపారు.

## మున్నూరుకాపుల అభివృద్ధికి కలిసి పనిచేయాలి

● మాజీ మేయర్ సంజయ్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపుల అభివృద్ధి కోసం ప్రతీ ఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లోని మున్నూరుకాపు సంఘం కార్యాలయంలో బుధవారం అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 16 సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు నేతలు పాల్గొన్నారు. గతంలో డీఎస్ మున్నూరుకాపుల అభివృద్ధికి ఏ విధంగా కృషి చేశారో ఇప్పుడు కూడా అదే రీతిలో పనిచేయాలని ఆయన కోరారు. మున్నూరుకాపుల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం అభివృద్ధితో పాటు అన్ని అంశాల్లో సహకరించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో దారం సాయిలు, ఆకుల రాజేశ్వర్‌తో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

## అన్నాచెల్లెలిని సన్మానించిన గ్రామస్థులు

కమ్మర్‌పల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన బక్కూరి పోత లింగన్న గంగముత్తు దంపతుల పిల్లలు (అన్నాచెల్లెలు) ఇద్దరు సైతం ఒకే ప్రయత్నంలో ఉపాధ్యాయకొలువులు సాధించారు వీరిరువురిని బషీరాబాద్ గ్రామస్థులు బుధవారం స్థానిక గ్రామపంచాయతీలో ఘనంగా సన్మానించారు. అన్న బక్కూరి కృష్ణమూర్తి 2024 డీఎస్సీ పరీక్షఫలితాల్లో జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 55వ ర్యాంక్ సాధించగా చెల్లెలు బక్కూరి మౌనిక 107 ర్యాంక్‌సాధించి ఎస్‌జీటి ఉపాధ్యాయులుగా కొలువులు సాధించారు.ఈకార్యక్రమంలో గ్రామస్థులు తూములింగన్న, శ్రీను, రవి, మురళి, బక్కన్న, నారాయణ, సంపత్, ము త్తెన్న, అశోక్, గంగారాం, శ్రీధర్, సత్యానంద్, శిరీష తదితర గ్రామస్తులు యువకులు పాల్గొన్నారు.

## జమిలీ ఎన్నికలు ఫెడరలిజానికి గొడ్డలిపెట్టు

రుద్రూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలు ఫెడరలి జానికి గొడ్డలి పెట్టు అని, రాష్ట్రాల హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్‌గౌడ్, పార్టీ నాయకులు గంగాధర్, సాయాగౌడ్, రాములు, సాయిబాబు, లక్ష్మణ్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా రాజరాజేశ్వరస్వామి కల్యాణం

డొంకేశ్వర్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలం నూత్ పల్లి గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగం గా ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది.గురువారం మహిళలచే స్వామివారికి బోనాలు సమర్పించనున్నట్టు ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి), ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బీఆర్‌ఎస్ నాయకులు ఇట్టెడి లింగారెడ్డి కోరారు. బుధవారం ఆలూర్ మండల కేంద్రంలో రైతులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో రైతులు వరిధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ఇకనైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దళారుల బారి నుంచి రైతులను కాపాడాలని లింగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గడ్డం భూమారెడ్డి, మగ్గిడి నర్సయ్య, ఎర్రన్న, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## మోస్రాలో ధాన్యం లారీ బోల్తా


బోల్తా పడిన లారీ దృశ్యం

మోస్రా,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో లారీ టైర్ పగిలి ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లారీ మోస్రా వద్ద వడ్ల లోడ్ నింపుకుని వర్ని ధర్మకాంటకు వెళుతున్న సమయంలో చందూర్ గ్రామ శివారులో నిజామాబాద్, బాన్సువాడ ప్రధాన రహదారిపై లారీ టైర్ పగిలి అదుపు తప్పి బోల్తా పడిపోయిందని కాగా లారీ డ్రైవర్‌కు చిన్న గాయాలతో బయట పడగానే తృటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం
# కళాశాలల ఆధ్వర్యంలో మానవహారం


బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం దృశ్యం

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల మూడో రోజు నిరసన కార్యక్రమం బుధవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తాలో కళాశాలల యాజమాన్యాలు, ఉద్యోగులు మానవహారం నిర్వహించారు. ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల్లో పనిచేస్తున్న అటెండర్ స్థాయి నుంచి అధ్యాపకుల వరకు ఈ నిరసనలో పాల్గొనడం జరిగిందని సమన్వయకర్త నరాల సుధాకర్ అన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టడంతో కళాశాలలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతభత్యాలు కొన్ని నెలలుగా అందకపోవడంతో వారు చాలా ఇబ్బందులు పడుతున్నారని అందువల్లే స్వచ్ఛందంగా సిబ్బంది నిరసనలో పాల్గొన్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు, యజమానులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా కేంద్రానికి వచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు కలిసి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొరకు చేస్తున్న ఉద్యమానికి సహకారాన్ని అందించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు యాజమాన్యాల ప్రతినిధులు సుజన్, అరుణ్‌కుమార్, హరికృష్ణ, బాలకృష్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**బోధన్‌రూరల్:** డిగ్రీ విద్యార్థుల ఫీజురియింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బోధన్‌లో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఆందోళన బాట చేపట్టాయి. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ, పీజీ ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు, యాజమాన్యాలు పాల్గొని మానవహారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఫీజురియింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు, అధ్యాపకులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సకాలంలో ఫీజురియింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం వల్ల యాజమాన్యాలపై ఆర్థిక భారం పడుతుందని దీంతో అధ్యాపకుల వేతనాలు చెల్లించడం భారంగా మారిందన్నారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజురియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల నిరవధిక సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మిమ్స్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస రాజు, ఉషోదయ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సూర్యప్రకాష్, ఎస్వీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సాయిరెడ్డి, విజయసాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జావీద్, అధ్యాపకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## వేల్పూర్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో
## ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

వేల్పూర్,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):మండలంలోని శ్రీ పోతు లూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మంత్రోచ్చారణాల మధ్య ప్రత్యేక పూజ కార్యక్రమాలతో పాటు హోమం, యజ్ఞం నిర్వహించారు. అంతకు ముందు గణపతిపూజ, నవగ్రహాల పూజ, అంకురారోపణ, గోవిం దమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వీరబ్రహ్మేంద్రస్వామికి ధ్వజస్తంభానికి అభిషేక కార్యక్రమంతో పాటు పూజాదివాసం, పుష్పది వాసం వంటి కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డితో పాటు విశ్వబ్రహ్మణ సంఘం సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలకు అనుమతించడం లేదని ఫిర్యాదు

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి), పూర్తిస్థాయిలో ట్యూషన్ ఫీజు చెల్లిస్తేనే తప్ప ఇంటర్నల్ పరీక్షలకు అనుమతించడంలేదని బుధవారం చేపూర్‌లోని క్షత్రీయ కళాశాల విద్యార్థులు తహసీల్దార్ గజానన్‌కు వినతిపత్రం అందజేశారు. బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ముందుగా ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతి ఇస్తామని కళాశాల వారు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు పేర్కొన్నారు. పరీక్షలకు అనుమతించేలా చూడాలని తహసీల్దార్‌ను విద్యార్థులు కోరారు.

## ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం

భీమ్‌గల్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ డివిజన్‌లో పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు పదో తరగతి అర్హత కలిగిన ఉన్న బాలబాలికలకు కార్మిక శాఖ ద్వారా ఐటీఐలో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్టు న్యాక్ ఇన్‌చార్జీ దిలీప్‌గౌడ్ తెలిపారు. ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతీఒక్క కార్మికుడు తమ పిల్లల కోసం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమాచారం కోసం కమ్మర్‌పల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ సహయ కార్మికశాఖ అధికారి ప్రభుదాస్ 9492555346 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

## వ్యక్తి అదృశ్యం

డొంకేశ్వర్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామానికి చెందిన సుంకరి భూమన్న మంగళవారం సాయంత్రం నుంచి ఆచూకీ లభించడం లేదని కుటుంబసభ్యులు తెలిపారు. భూమన్నకు ఆరోగ్యం బాగలేకపోవడంతో జిల్లా కేం ద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 14న చికిత్స నిమిత్తం చేర్పించారు. మారునాడు సాయంత్రం టాయిలెట్ వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ భూమన్న ఆచూకీ లభించలేదని నిజామాబాద్‌లోని ఒకటో పోలీస్‌స్టేషన్‌లో ఆయన కుమారుడు సుంకరి సంపత్ ఫిర్యాదు చేశారు.

## కాలువలో కాలుజారి పడి ఒకరి మృతి

మోస్రా,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలం (కొత్తపేట్) మల్కాపూర్ గ్రామంలో బుధవారం తెల్లవారు సమయంలో కాలకృత్యాలు చేసుకొని నిజాంసాగర్ కాలువలో కాలు జారి పడి ప్రాణాలు కోల్పోయిన ఘటన ఏర్పడింది. రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ఆరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట్, మల్కాపూర్ గ్రామ నివాసి పెద్దోళ్ల లింగం కాలకృత్యాలు చేసుకొనేందుకు గ్రామంలోని కాలువ కట్ట వద్దకు వెళ్లి కాలువలో కాలు జారి పడి ఈతరాక నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

## బట్టాపూర్‌లో కబ్రస్థాన్‌కు నీటి సౌకర్యం ఏర్పాటు

ఏర్గట్ల, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):మండలంలోని బట్టాపూర్‌లో బుధవారం కబ్రస్థాన్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నీటి సౌకర్య కోసం బోరు వేయించారు.గతకొన్ని రోజులుగా కబ్రస్థాన్‌వద్ద నీటిసౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అట్టి విషయాన్ని బాల్కొండ కాంగ్రెస్ పార్టీఇన్‌చార్జి ముత్యాల సునీల్ దృష్టికి తీసుకెళ్ళగా ఆయన వెంటనే స్పందించి బోరు వేయించారని కాంగ్రెస్ నాయకులు తెలిపా రు.

## గుర్తుతెలియని శవం లభ్యం

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి రైల్వేగేట్ సమీపంలో గుర్తుతెలియని(26) శవం లభ్యమైనట్టు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ హన్మండ్లు తెలిపారు. గూడ్స్ రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అధిక రక్తస్రవమై అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిసింది. మృతదేహాన్ని ఎస్సై సాయిరెడ్డి పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిస్తే ఎస్సై సాయిరెడ్డి 8712658591, హెడ్‌కానిస్టేబుల్ హన్మండ్లు 9440899341నెంబర్‌లకు సమాచారం అందించాలని తెలిపారు.

## ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

నవీపేట,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అభంగపట్నం, అబ్బాపూర్(ఎం) గ్రామాల మధ్యన మంగళవారం రాత్రి బైక్‌పై నుండి పడి తీవ్ర గాయాల పాలైన మహిళ అదే రాత్రి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందిందని ఏఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. బోధన్ మండలం పెగడాపల్లికి చెందిన లక్ష్మణ్ తన కుమారుడిని ధర్మారం హాస్టల్‌లో దింపి సాయంత్రం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడని అన్నారు. ఎడపల్లి మండలం జానకంపేట వద్ద పెగడాపల్లికి చెందిన మేడి మల్లవ్వ(39) లిఫ్ట్ అడిగి లక్ష్మణ్ బైక్‌పై ఎక్కిందని అన్నారు. సుమారు రాత్రి 7గంటల సమయంలో మండలంలోని అబ్బాపూర్(ఎం), అభంగపట్నం గ్రామాల మధ్యన మల్లవ్వ అదుపు తప్పి బైక్‌పై నుండి కింద పడడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయని 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందని ఆయన పేర్కొన్నారు. మృతురాలికి భర్త గంగాదర్, ఒక కుమారుడు ఉన్నారని, భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

## లక్కోరలో టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్ల ఆవిష్కరణ


లక్కోరలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయు నాయకులు

వేల్పూర్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి) ఈనెల 20న హైదరాబాద్‌లోని బాగ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీయుసీఐలో ఐఎఫ్‌టీయు విలీన సభను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలో ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు అర్వింద్ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. దేశంలో 14రాష్ట్రాల్లో సంఘటిత, అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న టీయుసీఐ(ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా) దృష్టికి వచ్చిందన్నారు. గత సంవత్సర కాలంగా అనే విధాలుగా చర్చించి ఉమ్మడి ప్రణాళిక ఆమోదించడం జరిగిందన్నారు. దేశ వ్యాపిత నిర్మాణానికి ఐఎఫ్‌టీయు టీయుసీఐలో విలీనం చేయాలని ఐఎఫ్‌టీయు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధులు తీర్మాణించడం జరిగిందన్నారు. అక్టోబర్ 20న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే జనరల్ బాడిలో ఈ విలీన చేయాలని ప్రకటించాలన్నారు. దీనిని కార్మికులు, మిత్రులు అర్థం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పీకెటీపి బీడీ ప్యాకర్స్, బీడీకార్మికులు పి.ఆనంద్, అన్వర్‌హుస్సెన్, ఎం.రాజేందర్, జి.ఒడ్డెన్న, ఆర్.జగదీష్, ఎన్.రమేష్, ఆర్.మురళి, జీ.పద్మ, కె.కవేరి, ఎం.జ్యోతి, ఎ.స్రవంతి, పాల్గొన్నారు.

**ముప్కాల్:** ఈనెల 20న హైదరాబాద్‌లోని బాగ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీయుసీఐలో ఐఎఫ్‌టీయు విలీన సభను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలో బీడీ కంపెనీలో బీడీ ప్యాకర్లు, బీఈ ప్యాకింగ్, బీడీ కార్మికులు, ఐఎఫ్‌టీయు నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. దేశ వ్యాపిత నిర్మాణానికి ఐఎఫ్‌టీయు టీయుసీఐలో విలీనం చేయాలని ఐఎఫ్‌టీయు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధులు తీర్మాణించడం జరిగిందన్నారు. అక్టోబర్ 20న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే జనరల్ బాడిలో ఈ విలీన చేయాలని ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నాయకులు పి.మనోజ్‌కుమార్, దేవరాజ్, రాజేశ్వర్, సుదర్శన్, బీడీకార్మికులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి

బిచ్కుంద, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహించే కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా అధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రత మంచి నీటి సరాఫరా, ప్రజా సమస్యలపై కార్యదర్శులు దృష్టి సారించి సౌకర్యాలు కల్పించడంతో పాటు పన్నుల వసూలు చేయాలన్నారు. విధుల నిర్వహణలో కార్యదర్శులు అశ్రద్ధ వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎల్‌పీఓ నాగరాజు, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 'బీడీ కార్మికులకు జీవనభృతి కల్పించాలి'

మాచారెడ్డి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి షరతులు లేకుండా బీడీ పరిశ్రమలో పనిచేసే అందరికి రూ.4016 జీవనభృతిని ఇవ్వాలని బుధవారం బీఎల్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ,శ్రామిక శక్తి బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పాల్వంచ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 ఫిబ్రవరి 28 వ తేదీ కటాఫ్ తేదీని తొలగించి 2016ల జీవనభృతిని 4016లకు పెంచి ఇవ్వాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో బీడీ కార్మికులకు ఇచ్చిన హామీ నేటికి అమలుచేయనందున నిరసన తెలపామని ప్రతీ ఒక్కరికి జీవనభృతి ఇవ్వకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి తగిన బుద్ధిచెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దిరాములు, అంజనేయులు, అనసూయ, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

## క్షతగాత్రులను పరామర్శించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

ఎల్లారెడ్డి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూర్ గ్రామ శివారులో బుధవారం సాయంత్రం రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వారిని అతివేగంగా వెళ్లిన ఆటో ఢీకొట్టడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందికి తెలిపారు.

## బిచ్కుంద ఎంపీఓపై విచారణ

బిచ్కుంద, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ఎంపీఓ అబ్బుగౌడ్‌పై జిల్లా పంచాయతీ రాజ్ అధికారి శ్రీనివాస్ బుధవారం విచారణ చేపట్టారు. మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శిలుగా విధులు నిర్వహించే వారి పట్ల కారణాలు లేకుండా హింసించడం అసభ్యకరంగా మాట్లాడడం లాంటివి భరించలేని కార్యదర్శులు వారం క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యదర్శులు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి వాస్తవాలను కలెక్టర్‌కు నివేదిస్తామని డీపీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ నాగరాజు, రమణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

రామారెడ్డి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నిజామాబాద్‌లో బుధవారం నిర్వహించే తెలంగాణ రాష్ట్ర సదస్సుకు మండలం నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు బయలుదేరి వెళ్లారు. ఇందులో యాదగిరి, రాజనర్సయ్య, శైలేష్, లావణ్య, పద్మ తదితరులు ఉన్నారు.

## పీజీటీ సివిక్స్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో పీజీటీ సివిక్స్ బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 18వ తేదిన లోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గాంధీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలిటికల్ సైన్స్ లేదా పబ్లిక్ అడ్మినిస్ట్రేష న్‌లో పీజీ, బీఈడీ చేసిన వాళ్ళు అర్హులని అన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బోధించాల్సి ఉంటుందని తెలిపారు. టెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

## 'దేశాయ్ బీడీ కంపెనీ దోపిడీకి అడ్డుకట్ట వేయాలి'

కామారెడ్డిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశాయ్ బీడీ కంపెనీలో జరుగుతున్న దోపిడిని అరికట్టాలని బీడీ సిగార్ యూనియన్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి సిరిసిల్ల రోడ్డులో గల కంపెనీ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల నుంచి టేకెదార్ల ద్వారా తప్పుడు పద్దతిలో వసూల్ చేసిన కోట్లాది రూపాయలను కార్మికులకు వాపస్ ఇవ్వాలన్నారు. బీడీ కార్మికుల కష్టం 1000 బీడీలకు రూ.10 వసూలు వెంటనే ఆపాలని, 1000 బీడీలకు సరిపడా మంచి ఆకుమాత్రమే సప్లయ్ చేయాలని డిమాండ్ చేశారు. చాట్‌పేరుతో చేసే దోపిడీని ఆపివేయాలని, శాంపిల్ బీడీల పేరుతో రోజుకు 400 బీడీ వసూల్ ఆపాలని అన్నారు. దాదాపు రెండు గంటల పాటు నిరసన తెలపడంతో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకుని కంపెనీ యాజమాన్యం, యూనియన్ నాయకులతో మాట్లాడి నిరసన చేస్తున్నవారిని అక్కడి నుంచి పంపించేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్వీ రమ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలమణి, కొత్తనర్సింలు, అరుణ్, వెంకట్‌గౌడ్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

## 'కేసు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి'


కామారెడ్డి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గాంధారి మండలంలోని గిరిజన కులానికి చెందిన ఎరుకల పెద్ద సాయిలుపై దాడి చేయడమే కాకుండా తిరిగి వృద్ధురాలైన తన తల్లిపైన కేసు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎరుకల హక్కుల ఐక్య పోరాటసాధన సమితి అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధారి గ్రామానికి 25 సంవత్సరాల క్రితం వచ్చిన సాయిలు దేశ్‌పాండే హన్మంత్‌రావు వద్ద భూమి కొనుగోలుచేసి మూడు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాడని గత నెల 26న దిలీప్‌రావు, కిష్టాగౌడ్, భాస్కర్‌గౌడ్, మధుసూదన్, సంతోష్‌లు సాయిలు ఇంట్లోలేని సమయంలో అతని భార్యను, తల్లిని, తమ్ముడు రమేష్‌మరదలును కులంపేరుతో దూషించి స్థలం ఖాళీ చేయాలని 50 మందితో కలిసి దాడిచేసి రేకులు, గుడిసెలను తొలగించారని తెలిపారు. దీంతో దాడిచేసిన వారిపై సాయిలు పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టగా తిరిగి వారు సాయిలు, అతని కుటుంబ సభ్యులపై తప్పుడు కేసు పెట్టారని తెలిపారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరామన్నారు.



# మెడికల్.. మాఫియా!

ఆంధ్రజ్యోతి ఫోకస్

- కామారెడ్డి జిల్లాలో పల్లెలకు విస్తరించిన మార్కెటింగ్ సిస్టం
- ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రైవేట్ ఆసుపత్రుల ఆఫర్లు
- కమీషన్ల కోసం కొందరు అనైతిక పద్ధతులు
- స్థాయికి మించిన వైద్యంతో సామాన్యులకు చిక్కులు
- ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దాడులు
- రెడ్ హ్యాండెడ్‌గా పలుచోట్ల దొరికినా.. పట్టులేని వైద్యులు
- మళ్లీ పర్యవేక్షణను మరిచిన వైద్య ఆరోగ్యశాఖ.. మొదటికి వచ్చిన పరిస్థితి



కామారెడ్డి టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి జ్వరం నుంచి పెద్దపెద్ద గాయాలైన వారికి సైతం స్థానిక ప్రైవేట్ వైద్యులే చికిత్స చేసి తక్కువ ఖర్చుతో ప్రాణాలను కాపాడే వారు. అందుకే వారిని ప్రజలు దేవుడితో సమానంగా భావించేవారు. కానీ రానురాను ఆ పరిస్థితి మారిపోతోంది. పల్లెలు, మారుమూ ల గ్రామాలే కాకుండా పట్టణ ప్రాంతాల్లోని కొన్ని వీధులే లక్ష్యంగా చేసుకుని మెడికల్ మార్కెటింగ్ వ్యవస్థ మాఫియాలా మారిపోతోంది. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ఆర్ఎంపీ, పీఎంపీలను లక్ష్యంగా చేసుకుని ఆఫర్లతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ ఆఫర్ల మైకంలో పడిన కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు అడ్డదారులు తొక్కుతూ అనైతిక వ్యవహారాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా సామాన్యులు ఆరోగ్యంతో పాటు డబ్బు కూడా నష్టపోతున్నారు. కమీషన్ల కోసం కొందరు అనైతిక పద్ధతులను అవలంభిస్తున్నారు. స్థాయికి మించిన వైద్యం అందించడంతో సామాన్యులు కొద్దిరోజుల్లోనే మళ్లీ అనారోగ్యానికి గురవుతున్నారు. ఇటీవల కలెక్టర్ ఆదేశాలతో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించడంతో పలువురు ఆర్ఎంపీ, పీఎంపీలు చేస్తున్న పట్టాలేని ఎంబీబీఎస్ వైద్యం బట్ట బయలు అయ్యింది. రెడ్ హ్యాండెడ్‌గా పలుచోట్ల పట్టుబడినా.. వైద్య ఆరోగ్య శాఖ మళ్లీ పర్యవేక్షణ మరవడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. ప్రస్తుతం చికెన్‌గున్యా, డెంగ్యూ లాంటి వ్యాధులు భయపెట్టిస్తుంటే.. మళ్లీ అదేపాత పద్ధతిలోనే చికిత్స లు అందిస్తూ.. ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి కమీషన్ల కోసం కక్కుర్తిపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మళ్లీ అదే తరహా దందా!!

నిబంధనల ప్రకారం ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స వరకే పరిమితం కావాలి. సర్టిఫైడ్ డాక్టర్ సూచించిన ప్రిస్క్రిప్షన్ ఆధారంగా సెలెన్ పెట్టడం, మందులు ఇవ్వడం, ఇంజెక్షన్ వేయడం వంటి సేవలు చేయవచ్చు. నేరుగా పరీక్షించడం, రోగ నిర్ధారణ చేయడం మందులు ఇవ్వడం చేయకూడదు. కానీ ఈ నిబంధన అమలు కావడం లేదు. అయితే ఇదే సమయంలో తక్షణ వైద్యసేవలు అందించే వారిగా ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రజల మనస్సును గెలుచుకుంటున్న మరి కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు తమ సామర్థ్యానికి మించి వైద్యసేవలు అందిస్తూ.. ప్రజల ప్రాణాలకు చేటు తెస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఈ తరహా ఘటనలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ తనిఖీలలో వాస్తవాలు బట్టబయలు అయ్యాయి. ఏకకాలంలో కొద్దిరోజులు అన్ని మండలాల్లో దాడులు చేయడంతో కిరాణదుకాణాల మాదిరి నెలకొల్పిన వైద్య కేంద్రాలను దాడులు ఆపేవరకు మూసివేసిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం దాడులు నిలిపివేయడం, పర్యవేక్షణ అంతంత మాత్రమే ఉండడంతో మళ్లీ కథ మొదటికి వచ్చి అదే తరహా దందా కొనసాగుతోందనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

### ప్రత్యేకంగా మార్కెటింగ్ వ్యవస్థ

ఒకప్పుడు హైదరాబాద్ కేంద్రంగా ఉండే బడా కార్పోరేట్ ఆసుపత్రులు తమకంటూ ప్రత్యేకంగా మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేది. వివిధ జబ్బులతో బాధపడేవారిని తమ వద్దకు రిఫర్ చేయాలంటూ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులను కోరేది. అలా ఆసుపత్రుల మధ్య పోటీ పెరిగి.. చివరకు జిల్లాకేంద్రం నుంచి గ్రామాల వరకు మెడికల్ మార్కెటింగ్ వ్యవస్థ విస్తరించింది. చిన్న, పెద్ద, కొత్త, పాత అనే తేడా లేకుండా వ్యాధిగ్రస్తులను రిఫర్ చేసిన ఆర్ఎంపీ, పీఎంపీలకు ఆకర్షణీయమైన ఆఫర్లు, ప్యాకేజీలను ప్రైవేట్ ఆసుపత్రులు ప్రకటిస్తున్నాయి. ఈ బంఫర్ ఆఫర్లు ప్యాకేజీలు అనేక రకాలుగా ఉంటున్నాయి. ఆర్ఎంపీ, పీఎంపీలు పంపిన వారు ఇన్‌పేషంట్‌గా చేరితే ఆ రోగికి చెల్లించే ఫీజులో 30శాతం, వివిధ టెస్టులకు సంబంధించి వేసే బిల్లుల్లో 50శాతం వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. కొన్ని కొత్త ఆసుపత్రులయితే నిలదొక్కుకునేందుకు ఔట్ పేషెంట్ విభాగంలోను ఆఫర్‌లు అందిస్తున్నాయి. ఒక నిర్ణీత సమయంలో లక్ష్యానికి మించి రోగులను రిఫర్ చేసినట్లయితే విదేశాలకు టూర్లను కూడా ఆఫర్ చేస్తున్నారు.

### అవగాహన లేకుండా వైద్య సేవలు

ఔషధాలకు ఉండే పరిమితులు, శరీర ప్రతిస్పందనలు, తదితర అంశాలపై అవగాహన లేకుండానే ఆర్ఎంపీ, పీఎంపీలు వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు లింగ నిర్ధారణ చేయడంతో పాటు గర్భవిచ్ఛిత్తి మాత్రలు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో తీవ్ర రక్త స్రావం జరిగి అనేక మంది అనారోగ్యం భారీన పడుతున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పలు గ్రామీణ ప్రాంతాల్లో వెలుగుచూసిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల రాజంపేట మండలకేంద్రంలో పోలీసులకు పట్టుబడిన లింగనిర్ధారణ కేసులో ఇద్దరు ఆర్ఎంపీ, పీఎంపీలు ఉండడం చూస్తేనే అర్థమవుతుంది ఏ స్థాయిలో ఈ దందా సాగుతుందోననేది. ఇక ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు గ్రామ స్థాయిలో వాటిని సెటిల్‌మెంట్ చేస్తూ.. విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు.



---

## పాడిపశువులకు అందని వైద్యం!

- గ్రామాలలో పశు వైద్యశాల సౌకర్యం లేక రైతుల అవస్థలు
- ప్రైవేట్ వైద్యులను సంప్రదించినా.. అందని వైద్యం




రాజంపేటలో శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల

రాజంపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం చేపడుతున్నారు. కాని పాడి పశువులకు ఏమైనా రోగాలు వస్తే చికిత్స అందించేందుకు వైద్యులు లేక వైద్య కేంద్రాలు మూత పడుతున్నాయి. కొన్ని గ్రామాలలో కేంద్రాలు లేక ప్రైవేట్ వైద్యులను సంప్రదించాల్సి వస్తుందని ప్రైవేట్ వైద్యులు కూడా సమయానికి రాకపోవడంతో పశువులకు వైద్య పరీక్షలు చేయించడానికి ఎన్నో అవస్థలు పడుతున్నామన్నారు. ఈ మధ్యకాలంలో వ్యవసాయంతో పాటు పశుపోషణ ప్రధాన వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్న రైతులు ఎంతోమంది ఉన్నారు. కానీ మండల కేంద్రంలోని సబ్ సెంటర్ ఉండడంతో శిథిలావస్థలో చిన్నపాటి గదిని పశువైద్యకేంద్రంగా ఏర్పాటు చేసి సిబ్బంది మాత్రం లేకపోవడంతో ఉన్నవారు కూడా సరైన సమయానికి రాకపోవడంతో ప్రైవేట్ వైద్యులను సంప్రదించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భిక్కనూర్ మండలంలోని జంగంపల్లి వైద్యశాల వైద్యుడు రాజంపేట మండలంలో ఇన్‌చార్జిగా ఉండడంతో సమయానికి సేవలు అందడం లేదని వాపోతున్నారు. పేరుకు మాత్రమే మండలంగా ఏర్పడిందని సిబ్బంది కొరత అలాగే ఉందని పేర్కోంటున్నారు. మండలంలోని తలమడ్ల, గుండారం గ్రామాలలో గోపాల మిత్ర సిబ్బంది ఉన్న వైద్యం అందడం లేదని ఆరోపిస్తున్నారు. మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 12 గ్రామపంచాయతీలలో పశువైద్యసౌకర్యం లేకపోవడంతో పాడిరైతులు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండారంలో పశువైద్యకేంద్రం ఉన్న అందులో సిబ్బంది లేకమూత పడిందని గ్రామస్థులు తెలిపారు. పశువైద్యశాలల్లో సిబ్బంది కోరతతో పాటు సరిపడా వసతులు లేక పశువులకు సరైన వైద్యం అందడం లేదు. గడిచిన 10ఏళ్ల కాలంలో సరైన వైద్యం నోచుకోకపోవడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. రైతులకు పాడి,పంట చేదోడువాదోడుగా ఉంటుండగా.. రోగం వస్తే పశువులను ఎక్కడ చూపించాలని ఆవేదన చెందుతున్నారు. సీజనల్ వ్యాధులతో పశువులు మృతిచెందుతున్న పట్టించుకునే పరిస్థితి లేదు. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కోటి ఆశలు పెట్టుకున్న రైతులు ఈసారైన పశుసంవర్ధక శాఖ కదలక పోతుందా? అని ఎదురుచూస్తున్నారు.

**● వైద్యం అందకపోవడంతో.. ప్రైవేట్ వైపు!!**

పాల ఉత్పత్తి పెంచడంలో రైతులు ముందున్నా.. గ్రామాలలో పశు వైద్యులు లేక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వస్తాయని గత కొన్ని సంవత్సరాల నుంచి గ్రామాలలో పశు వైద్యులు లేక ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. పశువులకు వైద్యపరీక్షలు చేయాలంటే ప్రైవేట్ వైద్యులను సంప్రదించాల్సి వస్తుంది. వారు సైతం సమయానికి రాకపోవడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలలో పశు వైద్యశాలలను ఏర్పాటు చేసి వైద్యులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

**మండల కేంద్రంలో సబ్‌సెంటర్ ఉంది..**

**: అనిల్‌రెడ్డి, ఇన్‌చార్జి పశువైద్యుడు, రాజంపేట**

మండలకేంద్రంలో సబ్ సెంటర్ ఉంది. అందులో సిబ్బంది అసిస్టెంట్, అటెండర్ ఇద్దరు ఉన్నారు. వీరితో పాటు ఇంచార్జ్ వైద్యులు మొత్తం మండలంలో సేవలు అందిస్తున్నాం. సిబ్బంది కొరత ఉండడంతో ఒకే సమయంలో అన్ని గ్రామాలు చూడలేమని రైతులు సమస్య కోసం ఫోన్ ద్వారా సంప్రదిస్తే అందుబాటులో ఉంటున్నామని, తలమడ్ల, గుండారం గ్రామాలలో గోపాల మిత్ర సిబ్బంది ఉన్నారు.

---

## యాసంగి పంటలు గట్టెక్కేనా?

● కామారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో అడుగంటుతున్న బోరుబావులు ● ప్రస్తుతం గట్టెక్కనున్న వర్షాకాలం పంటలు

దోమకొండ,(బీబీపేట) అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రానున్న యాసంగిలో పంటలపై రైతులకు ఫికర్ పట్టుకుంది. ఎలాగోల వర్షకాలపు పంటలు గట్టెక్కనున్నాయి. ఈ ఎడాది ఆగస్టు వరకు జిల్లాలో వర్షాలు కురియకపోవడంతో రైతులు నాటిన పంటలపై ఆశలు వదులుకుంటున్న సమయంలో సెప్టెంబరు నెలలో భారీ వర్షాలు కురిసి చెరువులు నిండి అలుగులు పారాయి. వాగులు, కుంటలు మత్తడి దుకాయి.

**● ఒక్కరోజులోనే అలుగు పారిన బీబీపేట పెద్ద చెరువు**

సెప్టెంబరు నెలలో కురిసిన భారీ వర్షానికి బీబీపేట పెద్ద చెరువు ఒక్కరోజులనే నిండి అలుగు పారింది. ఎన్నడులేని విధంగా ఒక్కరోజులోనే భారీ వర్షం కురియడంతో మెదక్ జిల్లాలోని లక్ష్మాపూర్, తొనిగండ్ల, కామారెడ్డి జిల్లాలోని బిక్కనూర్ మండలంలో ర్యాగట్లపల్లి, గుర్జకుంట,బిక్కనూర్, లక్ష్మీదేవునిపల్లి, అంతంపల్లి, దోమకొండ మండలం లింగుపల్లి,గొట్టిముక్కుల, సంగమేశ్వర్, బీబీపేట మండలం మాందాపూర్ గ్రామాల మీదుగా బీబీపేట చెరువుకు వాగు నీటి ప్రవహం వెళ్లడంతో ఎడు గ్రామాలకు జీవనాధారమైనటువంటి బీబీపేట పెద్ద చెరువు ఒక్క రోజులోనే నిండి అలుగు పారింది.

**● 3 రోజులు భారీ వర్షం కురిసినా.. పెరగని భూగర్భ జలాలు**

కామారెడ్డి జిల్లావ్యాప్తంగా ఆగస్టు వరకు వర్షం అంతంత మాత్రంగానే కురిసింది. సెప్టెంబరు నెలలో బారీ వర్షం కురిసినప్పటికీ కొన్ని మండలాల్లో భూగర్భ జలాలు పెరగలేదు. కామారెడ్డి జిల్లాలోని దోమకొండ, బిక్కనూర్, బీబీపేట, మాచారెడ్డి, కామారెడి, తదితర మండలాల్లో బోరుబావులు అడుగంటిపోతున్నాయి.సెప్టెంబరు నెలలో కురిసిన భారీ వర్షం అనంతరం మళ్లీ ఇప్పటి వరకు జిల్లాలో ఎక్కువ మోతాదులో వర్షం కురియకపోవడంతో బోరుబావుల్లో నీరు తగ్గిపోయింది.



బీబీపేట పెద్దచెరువు అలుగు పారుతున్న దృశ్యం(ఫైల్)

**● యాసంగి పంటలపై రైతుల్లో ఆందోళన**

వర్షకాలం పంటలు చెతికి వచ్చే సమయంలో పంటలకు నీరందడం లేదు. దోమకొండ, బీబీపేట మండలాలతో పాటు కొన్ని మండలాల్లో ప్రస్తుతం పంటలను కాపాడుకునేందుకు రైతులు సహసం చేస్తున్నారనే చెప్పకోవచ్చు. ప్రస్తుత పరిస్థితులే ఇలా ఉంటే వచ్చే యాసంగి పంటలు పండుతాయో లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.



దోమకొండ శివారులోని పంట పొలాల్లో నుంచి పారుతున్న ఎడ్ల కట్ట వాగు (ఫైల్)

**● ఉధృతంగా ప్రవహించిన ఎడ్ల కట్ల వాగు**

దోమకొండ మండలంలోని ఎడ్లకట్ట వాగుకు ఒక ప్రత్యేకత ఉంది. ఎడ్లకట్ట వాగు పారితే బీబీపేట చెరువు నిండుకుండాల మారుతుందని అందువలన ప్రజలందరు సుఖసంతోషాలతో జీవిస్తారని తరాల నుంచి పెద్దలు చెపుతున్నమాట. అయితే ఈ సారిమాత్రం భారీ వర్షం కురిసినప్పటికి ఉధృతంగా వాగులు పారినప్పటీకి రెండు మూడ రోజుల్లోనే వాగుల్లో నీరు కనబడకుండ పోయింది. దీంతో బోరుబావుల్లో నీరు పెరుగలేదు. చెరువులు, కుంటలు, నీటితో నిండినప్పటికి బోరుబావుల్లో నీటి శాతం పెరుగలేక వర్షకాలం కుడా పూర్తి కాకముందే బోరుబావుల్లో నీరు తగ్గిపోయింది. దీంతో యాసంగి పంటలు పండుతాయో లేక పెట్టుబడి కుడా రాకపోతే అప్పలపాలవుతామనే ఆందోళనలతో నీరు అందెంత వరకు మాత్రమే పంటలను సాగు చేసుకోవాలనే ఆలోచన రైతులు ఉన్నారు. .

---

ఆంధ్రజ్యోతి పరిశీలన



జుక్కల్ నియోజకవర్గం గుండా వెలుతున్న 161వ జాతీయ రహదారి

### 161వ జాతీయ రహదారిపై

## ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటయ్యేనా?

● రహదారి బాగుతో చోటు చేసుకుంటున్న వరుస ప్రమాదాలు ● గోల్డెన్ అవర్ మిస్సవుతున్న క్షతగాత్రులు ● ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుతో తగ్గనున్న మరణాలు ● ప్రభుత్వ ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు.

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎన్నో సంవత్సరాలుగా జుక్కల్ నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్న నాలుగు వరుసల రహదారి కేంద్ర ప్రభుత్వ కృషితో జుక్కల్ నియోజక వర్గానికి నాలుగు వరుసల రహదారి మంజూరు అయ్యింది. దీంతో పనులను పొందిన కంపెనీ వారు ఈ రహదారిని సంగారెడ్డి జిల్లా కేంద్ర నుండి మహారాష్ట్ర లోని దెగ్లూర్ పట్టణం వరకు నిర్మాణం చోటు చేసుకుంది. ఈ రహదారి జుక్కల్ నియోజక వర్గంలోని నిజాంసాగర్ మండలం గుండా ప్రారంభం అయి పిట్లం, పెద్ద కొడప్‌గల్, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్ మండలాల గుండా సుమారు 60 కిలోమీటర్ల మేర నిర్మాణం అయిఉంది. దీంతో జుక్కల్ నియోజక వర్గ ప్రజలే కాకుండ మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులతో పాటు బాన్స్‌వాడ నియోజకవర్గంకు చెందిన ప్రయాణికులు ప్రతి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం ఈ రహదారిపై భారీ వాహనాలతో పాటు, ఇతర వాహనాలు వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి బాగుంటంతో వాహనాలు వేగంగా వెల్తుండటంతో పాటు జంక్షన్ల వద్ద ప్రదాన రహాదారి నుండి గ్రామాలలోకి వెల్లే సమయంలో, గ్రామాలలో నుంచి ప్రధాన రహదారి పైకి వాహనాలు వచ్చే సమయంలో వాహనదారుల పొరపాటు వలన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రమాదం జరిగిన సమయంలో వాహనదారులు అక్కడికక్కడే మరణిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు హైవే సిబ్బంది అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. అయితే క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించిన తరువాత అక్కడి ఆసుపత్రులలో సరియైన వైద్య సేవలు లేని కారణంగా మరణాల సంఖ్య ఎక్కువగా నమోదు అవుతుంది.

**● చికిత్స చేస్తే మరణాల సంఖ్య తగ్గే అవకాశం**

రహదారులపై ప్రయాణం చేస్తున్న సమయంలో ప్రమాదం బారిన పడిన వారిని గంటలోపు సమీపంలో ఉన్న ఆసుపత్రులకు తరలించేనట్లయితే అది గోల్డెన్ అవర్‌గా భావించి చికిత్స చేస్తే మరణాల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. అయితే జుక్కల్ నియోజక వర్గంలో ఉన్న ఆసుపత్రులలో పిట్లం, పెద్ద కొడప్‌గల్, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్ ఆసుపత్రులలో అత్యవసర చికిత్సకు అవసరమైన సదుపాయాలు లేకపోవడంతో క్షతగాత్రులను బాన్స్‌వాడ లేదంటే దెగ్లూర్ ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఇంక క్షతగాత్రుల పరిస్థితి సీరియస్‌గా ఉంటే నిజామాబాద్ లాంటి పట్టణాలకు తరలిస్తున్నారు. దీంతో అంతదూరం వెల్లేసరికి ఆలస్యం జరగడంతో మరణాల సంఖ్య పెరుగుతుంది. గత మూడు సంవత్సరాల కిందట పెద్దకొడప్‌గల్ మండలం జగన్నాథపల్లి శివారులో ఈ రహదారిపై ఆగి ఉన్న లారీని టవేరా వాహనం డీకొట్టడంతో టవేరా వాహనంలోని చిన్నారులతో సహా 11 మంది మృత్యువాత పడ్డారు. ఇలాంటి ఘటనలే కాకుండ నిజాంసాగర్ మండలం నుండి దెగ్లూర్ పట్టణం వరకు గతంలో జరిగిన ప్రమాదాలలో వందల సంఖ్యలో ప్రయాణికులు మృత్యువాత పడిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

**● ప్రభుత్వ ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు**

ఇటీవల ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గల జాతీయ, రాష్ట్ర రహదారులపై 74 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు గాను 1116 కోట్ల రూపాయలతో మూడు దశల్లో రాష్ట్ర వ్యాప్తంగా ట్రామా కేర్ సెంటర్లు నిర్మించాలని ఆలోచన చేసింది. ట్రామా కేర్ సెంటర్లను మూడు దశల్లో నిర్మించాలని, మొదటి రెండు దశలో 24 ప్లస్ 24 చొప్పున 48 సెంటర్లు, మూడో దశలో 26 చొప్పున మొత్తం 74 ట్రామా కేర్ సెంటర్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ట్రామా కేర్ సెంటర్లలో అత్యవసర చికిత్సలు చేసేందుకు గాను 73 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. ప్రమాదాలు జరిగే సమయంలో క్షతగాత్రులను కాపాడేందుకు ఈ ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఈ 161 జాతీయ రహదారిపై కూడ ట్రామా కేర్ సెంటర్ వస్తుందని నియోజక వర్గ ప్రజలు ఆశిస్తున్నారు. నిజాంసాగర్ మండలం నుండి మద్నూర్ మండలం వరకు 161వ జాతీయ రహదారి ఉండగా, జుక్కల్ చౌరస్తా ప్రాంతంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

**● ట్రామా కేర్ సెంటర్ కోసం ఎమ్మెల్యే కృషి చేయాలి**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 74 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో జుక్కల్ నియోజక వర్గం నుండి 161వ జాతీయ రహదారి వెల్తుందని, ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే కృషి చేయాలని జుక్కల్ నియోజక వర్గ ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటయితే ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాపాయం అదికంగా జరగకుండ వీలవుతుందని, అందుకే ఎమ్మెల్యే ట్రామా కేర్ సెంటర్ మంజూరు కోసం కృషి చేయాలని నియోజక వర్గ ప్రజలు ఎమ్మెల్యేను కోరుతున్నారు

**ఆసుపత్రులకు తీసుకవెల్లేంత వరకు ఆలస్యం**

**: బుగుడాల గోపి, స్థానికుడు, పిట్లం**

జుక్కల్ నియోజక వర్గం గుండా 161వ జాతీయ రహదారి వెల్లడం బాగానే ఉంది. కానీ ప్రమాదాలు జరిగిన సమయంలో ఈ రహదారిపై ట్రామా కేర్ సెంటర్ లేక క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు దగ్గరలో ఉన్న ఆసుపత్రులకు తీసుకవెల్లేంత వరకు ఆలస్యం జరుగుతుంది. ఒక వేళ ఈ రహదారిపై ట్రామా కేంద్రం ఉంటే చికిత్స అందుబాటులో ఉండి వైద్యం సకాలంలో అందుతుంది. అందుకే ఈ రహదారిపై ట్రామా కేంద్రం అత్యవసరం.

**జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు**

**: అజయ్, స్థానికుడు, జుక్కల్**

జుక్కల్ నియోజక వర్గ గుండా 161 జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అందుబాటులో హైవే సిబ్బంది అంబులెన్స్‌లు ఉంచిన సరియైన సమయంలో చికిత్స అందక చాలామంది మరణిస్తున్నారు. ఒక్కోసారి ప్రమాదం తీవ్ర స్థాయిలో జరిగినప్పుడు కూడ క్షతగాత్రుల సంఖ్య బాగానే ఉంటుంది. ఈ ప్రాంతంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి

## విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

● ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి

భిక్కనూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి అన్నారు. బుధవారం భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుల, విద్యార్థుల రిజిస్టర్లను, పాఠశాల తరగతి గదులను, బోజనశాలను పరిశీంచారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులు అర్థమయ్యే విధంగా బోధిస్తున్నారా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో తెలంగాణ క్రీడాప్రాంగణం ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ప్రతీ విద్యార్థి పదవతరగతిలో ఉత్తీర్ణత పొందేవిధంగా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జయదేవ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు టీకాలు



అంచనూర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి శివ

దోమకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంచనూర్ గ్రామంలో బుధవారం పాడి పశువులకు ప్రభుత్వ పశుసంవర్థకశాఖ ద్వారా ఉచితంగా గాలికుంటు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి శివ తెలిపారు. 300 పశువులకు టీకాలు వేసి, పశువులలో గర్భకోశ వ్యాధుల నిర్ధారణ, చికిత్సలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు వేయించుకోవాలని పాడి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్టాక్ అసిస్టెంట్ కిషోర్, వెటర్నరీ అసిస్టెంట్ భూమయ్య, లింగం, బాబు, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

## పశువులకు ఎఫ్‌ఎండీ టీకాలు



కారెగాంలో పశువులకు టీకాలు వెస్తున్న పశువైద్యాధికారి

పిట్లం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతీ గ్రామంలో పశువులకు ఎఫ్‌ఎండీ టీకాలు వేయనున్నామని పశువైద్యాధికారి సంతోష్ తెలిపారు. బుధవారం మండలంలోని కారెగాం గ్రామంలో 86 ఆవులు, 121 గేదెలకు ఎఫ్‌ఎండీ టీకాలు వేశామని పశువైద్యాధికారి తెలిపారు. మండలంలో 15 నుంచి నవంబరు15 వరకు ప్రతీ గ్రామంలో గాలికుంటు టీకాలు వేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర పండరి, గణపతి పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ నూతన అధ్యక్షుడిగా తుల శ్రీనివాస్



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం బాన్సువాడ శాఖ నూతన అధ్యక్షుడిగా తుల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి, ఎన్నికల అధికారి సాయిరాం సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అజీం, కోశాధికారిగా అబ్దుల్ రజాక్, ఉపాధ్యక్షుడిగా రవిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి శాఖ సభ్యులున్నారు.

## రేషన్ డీలర్ కుటుంబానికి ఆర్థిక సాయం


నసురుల్లాబాద్, అక్టోబరు 16: నసురుల్లాబాద్ మండలం మిర్జాపూర్ గ్రామ రేషన్ డీలర్ జంగిలి నారాయణ ఇటీవల మరణించడంతో తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్, రేషన్ డీలర్లతో కలిసి బుధవారం జంగిలి నారాయణ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు మాట్లాడుతూ భవిష్యత్తులో వారి కుటుంబ సభ్యులకు అండదండగా ఉంటామన్నారు. రేషన్ డీలర్ మృతి తీరని లోటని, ఆ కుటుంబానికి ఎల్లప్పుడు అండదండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జనార్థన్‌రెడ్డి, కామారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు నాగం సురేందర్, గౌరిశెట్టి రాజు, జిల్లా కోశాధికారి ప్రభాకర్, బీర్కూర్ మండల రేషన్ డీలర్‌లు పోతుల నరసింహులు, నాగరాజు, మండల అధ్యక్షులు రాజశేఖర్, శివరాజ్, సుధీర్ తదితరులు ఉన్నారు.

## ఎల్‌ఆర్‌ఎస్ సర్వే త్వరితగతిన పూర్తి చేయండి

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 16: జుక్కల్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గతంలో ఆన్‌లైన్‌లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ఎంపీవో రాము పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండలంలోని ఖండే బల్లూర్ గ్రామంలో నిర్వహించిన ఎల్‌ఆర్‌ఎస్ సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపివో రాము మాట్లాడుతూ గతంలో ఆయా గ్రామాల్లో లబ్ధి దారులు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారని అటువంటి వాటిని త్వరగా సర్వే నిర్వహించి పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భరత్ పాల్గొన్నారు,

## సీపీఎం జిల్లా మహాసభకు తరలిరండి

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 16: కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 19 జరిగే సీపీఎం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్‌గొండ పిలుపునిచ్చారు. బుధవారం జుక్కల్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతి రేక వైఖరిపై నిర్వహిస్తున్న ఈ సభకు రాష్ట్ర జాతీయ స్థాయి నాయకులు వస్తు న్నందున జుక్కల్ నియోజక వర్గంలోని సీపీఎం అభిమానులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సీపీఎం భవిష్యత్తు కార్యాచరణ, పార్టీ అనుసరించే విధానాలపై కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్, సీపీఎం నాయకులు గోవింద్, వీరయ్య, షేక్ ఫిర్దోస్, విఠల్, బాలాజీ, సాగర్, అడప్ప, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేష్ గొండ

# కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల ప్రత్యేకాధికారి



పెద్ద కొడప్‌గల్‌లో ప్రారంభిస్తున్న నాయకులు



మైలారం గ్రామంలో ప్రారంభిస్తున్న చైర్మన్



దోమకొండలో ప్రారంభిస్తున్న చైర్మన్ నాగరాజ్‌రెడ్డి

సదాశివనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని జడ్పీసీఈవో మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్ తెలిపారు. సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి, పద్మాజీవాడి, ఉత్తునూర్, సదాశివనగర్ పీఏసీఎస్ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం వరి మద్దతు ధర రూ.2320 ప్రకటించడం జరిగిందని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కేంద్ర నిర్వాహకులు సూచించిన విధంగా తేమ శాతాన్ని ఉండేవిధంగా ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా షామియానా, నీటి వసతి కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ప్రజాపతి, చైర్మన్‌లు కమలాకర్‌రావు, గంగాధర్, సదాశివరెడ్డి, ప్రభాకర్‌రావు, సీఈవోలు దేవేందర్‌రావు, నయిమ్, విగ్నేష్‌గౌడ్, బైరయ్య, ఏఈవోలు శ్రీలక్ష్మీ, కవిత, గాయత్రి పాల్గొన్నారు.

**గాంధారి:** గాంధారి మండలంలో వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సింగిల్‌విండో ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులకు అమ్మి నష్టపోవద్దన్నారు. వరి ధాన్యాన్ని తేమశాతం లేకుండా చూడాలని సూచించారు. మండలంలోని గాంధారి, గుర్జాల్, పోతంగల్, మాత్‌సంగెం, పేట్‌సంగెం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పరమేష్, వైస్ చైర్మన్ ఉద్దల్‌సింగ్, మాజీ సర్పంచ్‌సంజీవ్, మోహన్‌రెడ్డి, గణపతి, సంతోష్, సాయిలు పాల్గొన్నారు.

**రాజంపేట:** మండలంలోని ఆర్గొండ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు సొసైటీ చైర్మన్ కంది శివరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని దళారులకు నమ్మిమోసపోవద్దని ప్రతీ ఒక రైతు వడ్లు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, మానిటరింగ్ అధికారి మసియొద్దిన్, డైరెక్టర్‌లు మధుకర్, మల్లారెడ్డి, చిన్న సాయిలు, కార్యదర్శి సాయిలు, ఏఈవో రజిత, ఏఎంసీ డైరెక్టర్‌లు బాలరాజు, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**నసురుల్లాబాద్:** రైతులు తాము పండించిన పంటకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మైలారం సొసైటీ చైర్మన్ దేవల హనుమంత్ రావు అన్నారు. బుధవారం మండలంలోని మైలారం గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటను ఏ గ్రేడ్ ధాన్యాన్ని 2320, బి గ్రేడ్ ధాన్యాన్ని 2300 ప్రభుత్వం కేటాయించిన ధరను వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేస్తున్నామని అన్నారు. అదనంగా సన్న రకపు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, సెక్రటరీ నరేందర్, పవన్, రాము, రైతులు పాల్గొన్నారు.

**పెద్దకొడప్‌గల్:** మండల కేంద్రంలోని సహకార సంఘ ఆవరణలో బుధవారం అధ్యక్షులు హన్మంత్ రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశ్యంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిం దని తెలిపారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఆరబెట్టి తగిన తేమశాతం వచ్చే విధంగా చేసుకుని ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలని సూచించారు, ప్రభుత్వం వరి క్వింటాలుకు మద్దతు ధర వరి ఏ గ్రేడు రకానికి 2320 రూపాయలు, బి గ్రేడు రకానికి 2300 రూపాయలు ప్రకటించినందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం పరిధిలోని పెద్ద కొడప్‌గల్‌తో పాటు కాస్లాబాద్, అంజని, గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరథం, సీఈవో సందీప్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షులు మహేందర్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, అక్కలి సాయిరెడ్డి, సంజీవ్, పండరి తదితరులు పాల్గొన్నారు.

### రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

● తహసీల్దార్ శివప్రసాద్

భిక్కనూరు: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి, పెద్ద మల్లారెడ్డి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, డీసీసీబీ డైరెక్టర్ కిష్టాగౌడ్ మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్లు వెంకట్‌రెడ్డి, రాజాగౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ పాపనోళ్ల స్వామి, ఏవో రాధ, విండో సీఈవోలు శ్రీనివాస్, మోహన్‌గౌడ్, డీటీ కిష్టయ్య పాల్గొన్నారు.

**దోమకొండ:** మండలంలోని 6 గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించినట్లు విండో చైర్మన్ నాగరాజ్‌రెడ్డి, సీఈవో బాల్‌రెడ్డి తెలిపారు. విండో పరిధిలోని గొట్టిముక్కుల, సంగమేశ్వర్, లింగుపల్లి, అంచనూర్, మాందాపూర్, దోమకొండ గ్రామాల్లో సెంటర్లను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విండో డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి సొసైటీ పరిధిలోని గండి మాసానిపేట్ వద్ద బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింలు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో మాత్రమే రైతులు వరి ధాన్యాన్ని అమ్మి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను పొందాలని తెలిపారు. అదే విధంగా శివనగర్ గేటు వద్ద డీసీసీబీ డైరెక్టర్ కాసాల శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మారెడ్డి రజితారెడ్డి, కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సొసైటీ వైస్ చైర్మన్ మత్తమాల ప్రశాంత్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ ఉషాగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, తహసీల్దార్ మహేందర్, డీటీ సురేష్, ఏఈవో సతీష్, డైరెక్టర్లు దేవదాస్, లక్ష్మణ్‌నాయక్, నర్సింలు, గ్రామ పెద్దలు శ్రవణ్ కుమార్, వాహబ్, వహీద్, బబ్లూ, శంకర్, సిబ్బంది మల్లేష్, సత్యం, ప్రభుదాస్ రైతులు పాల్గొన్నారు.

### నాగిరెడ్డిపేటలో 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలు..

నాగిరెడ్డిపేట, అక్టోబరు 16 : మండలంలోని తాండూర్, మల్తుమ్మెద సొసైటీల పరిధిలో గ్రామాల్లో బుధవారం 16 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తాండూర్ సొసైటీ పరిధిలోని గ్రామాల్లో 11 కేంద్రాలను, మాల్తుమ్మెద సొసైటీ పరిధిలోని గ్రామాల్లో 5 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తాండూర్ గ్రామంలో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ తాండూర్ సొసైటీ అధ్యక్షుడు గంగారెడ్డితో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మాల్తుమ్మెద సొసైటీ పరిధిలోని వాడి గ్రామంలో స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ రావు, సొసైటీ అధ్యక్షుడు దుందిగల్ల నర్సింలుతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మిగతా గ్రామాల్లో ఆయా సొసైటీల అధ్యక్షులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు, బాబురావు, కృష్ణవేణి, రాజిరెడ్డి, సీఈవోలు జైపాల్‌రెడ్డి, సందీప్, సొసైటీల డైరెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

### లింగంపేట, జల్దిపల్లి గ్రామాల్లో..

లింగంపేట : మండలంలోని లింగంపేట, జల్దిపల్లి గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. రైతు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం విక్రయించాలని ఆయన రైతులను కోరారు. ప్రభుత్వం ఏ గ్రేడు ధాన్యానికి రూ.2320 చెల్లిస్తుందని ఆయన తెలిపారు. ధాన్యం తూకం వేసిన మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని ఆయన తెలియ జేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సుజాత, శ్రీను, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, రైతులు ఆకుల సంగయ్య, ముదాం సాయిలు, రఫీఖ్‌లతో పాటు రైతులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి



కలెక్టరేట్‌కు వచ్చిన కిసాన్ సంఘ్ నాయకులు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం వద్ద ఒక్క సంచికి 40 కేజీల 650 గ్రాములు మాత్రమే కాంటా చేయాలని, ప్రతీ కొనుగోలు సెంటర్‌లో సిటిజన్ ఛ్యాలెట్ ఫ్లెక్సీ పెట్టాలన్నారు. వడ్లు కాంట అయిన తర్వాత 24 గంటలలోపు రైతులకు డబ్బులు చెల్లించాలని, వడ్ల కుప్పలపై కప్పేందుకు టార్పలిన్‌లు అందించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌రావు, రాష్ట్రసభ్యులు శ్రీధర్‌రెడ్డి, జోనల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతీఒక్కరిని ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయించాలి

● ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్



మాట్లాడుతున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరిని ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకు నేలా చూడాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. బుధవారం కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 9, 10వ తేదీన ప్రతీ గ్రామంలో బూత్‌లలో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, ఎవరైనా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారు ఉంటే దరఖాస్తు చేసుకోని వారు ఉంటే దరఖాస్తు చేసుకునే విధంగా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, నాయకులు నాగం సాయిబాబా, శంకర్, అట్కారి బబ్లూ, రజాక్, బాలకిషన్, గఫార్ పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిపై కేసు నమోదు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రియా డిలక్స్ కాంప్లెక్స్ వద్ద గల శివం ఎలక్ట్రికల్స్ నడుపుతున్న బక్కతట్ల బాలేందర్, శివరాజులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గాంధారి మండలానికి చెందిన బాలేందర్, అతని పార్టనర్ శివరాజులు ఈ నెల 15న షాపులో పనిచేస్తుండగా అదే సమయంలో అక్కడికి కారులో వచ్చి గొడవపడ్డారు. షాపులో ఉన్న బాలేందర్ తమను చూసి నవ్వుతున్నాడని అనుకొని కారు దిగి వచ్చి ఐదుగురు వ్యక్తులు షాపులోకి వెళ్లి బాలేందర్‌ను ఇష్టవచ్చినట్లు తిడుతూ కొట్టి షాపు నుంచి బయటకు తీసుకునివచ్చారని తెలిపారు.షాపులో ఉన్న సామాగ్రిని బయటకు పడేసి అడ్డువచ్చిన శివరాజును కూడా కొట్టారని తెలిపారు. బాలేందర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ

భిక్కనూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమల్లారెడ్డి విండో ఆవరణలో కాంప్లెక్స్ (షెట్టర్ల) నిర్మాణానికి బుధవారం విండో చైర్మన్ రాజాగౌడ్, ఏఈ నరేష్ భూమి పూజ చేశారు.

## ఆల్ఫాజోలం పట్టుకున్న పోలీసులు



నిందితులతో పోలీసులు

లింగంపేట, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురాపల్లిలో బుధవారం పోలీసులు ఆల్ఫోజోలం పట్టుకుని ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆరుణ్‌కుమార్ తెలిపారు. సురాయిపల్లిలో రమేష్ గౌడ్ ఆల్ఫోజోలంతో పాటు ఇతర రసాయనాలు కలిపి కల్తీ కల్లు తయారు చేసి విక్రయిస్తున్నాడని కచ్చితమైన సమాచారం రావడంతో పోలీసులు కల్లు దుకాణంపై దాడి చేయగా అక్కడ 30 గ్రాముల ఆల్ఫోజోలం దొరకగా ఎక్కడి నుంచి సరఫరా చేస్తున్నారని పోలీసులు రమేష్‌గౌడ్‌ను విచారించగా నేరం ఒప్పుకుని నాగిరెడ్డిపేట మండలానికి చెందిన తన బావమరిది కలాలి సత్యనారాయణగౌడ్ ఆల్ఫోజోలం సరఫరా చేస్తున్నాడని తనకు అతడే తీసుకువచ్చి ఇచ్చాడని చెప్పగా పోలీసులు సత్యనారాయణగౌడ్‌ను పట్టుకుని విచారించగా అతని వద్ద మరో 20 గ్రాముల ఆల్ఫోజోలం లభించడంతో పాటు నేరం ఒప్పుకున్నాడని దీంతో వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లు స్వాదిన పరుచుకుని కేసు నమోదు చేసి వారిద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఆల్ఫోజోలం పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన హెడ్ కానిస్టేబుల్ రాజేందర్, కానిస్టేబుల్స్ భైరవ ప్రసాద్, రమేష్, రామస్వామి, సంపత్ కుమార్, రాజును డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

## గిరిజన పాఠశాలకు బెంచీల వితరణ

నాగిరెడ్డిపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బంజార తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రముఖ శాస్త్రవేత్త, రాష్ట్ర బీజేపీ నాయకులు పైడి ఎల్లారెడ్డి స్వచ్ఛందంగా 10 బెంచీలను బుధవారం వితరణ చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పైడి ఎల్లారెడ్డి వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే బంజారా గిరిజన పాఠశాల విద్యార్థుల కోసం 10 బెంచీలను ఆయన స్వచ్ఛందంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కోసం తమవంతు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ మూర్తి, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, జిల్లా బీజేపీ కార్యవర్గసభ్యుడు హన్మాండ్లు, నాయకులు దేవీసింగ్, కిషన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

● వాహనం స్కిడ్ అయి ఇద్దరికి తీవ్ర గాయాలు

లింగంపేట, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యపల్లి సమీపంలో లింగంపేట- గోపాల్‌పేట రహదారిపై ధాన్యం ఆరబెట్టడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పర్మల్ల గ్రామానికి చెందిన బీజీ, గణేష్‌లు పర్మల్ల నుంచి లింగంపేటకు వెళ్లతుండగా అయ్యపల్లి వద్ద రోడ్డుపై ధాన్యం ఆర బోశారు. దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడగా బీజీకి తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు గణేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బీజీ పరిస్థితి విష మంగా ఉండడంతో ఆమెను కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు.



## విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల నియామక పక్రియలో భాగంగా బుధవారం పెద్ద కొడప్‌గల్ మండలంలోని ఆయా గ్రామాల్లో విధులు నిర్వహించేందుకు నూతనంగా 52 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. వీరంతా మండల విద్యాధికారి ప్రవీణ్‌కు తమ జాయినింగ్ రిపోర్టులు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ప్రవీణ్ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో ప్రభుత్వం కొత్త ఉపాధ్యాయులకు నియమించగా 52 మంది ఉపాధ్యాయులు రిపోర్టు చేశారని తెలిపారు. గతంలో బదిలీ అయిన ఉపాధ్యాయులు మండలం నుంచి 30 మంది వెళ్లిపోయారని తెలిపారు. కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు పాఠశాలలు కేటాయించడం జరిగిందని తెలిపారు.

రాజంపేట: మండలంలో 14మంది నూతన ఉపాధ్యాయులు వచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ ఎస్‌జీటీలు పది మంది ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ నలుగురు ఉపాధ్యాయులు వచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## దాబా యజమానులపై కేసులు

పిట్లం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా దాబా హోటల్‌లో సిట్టింగ్ నిర్వహిస్తున్న యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి వేళలో ఇష్టారాజ్యంగా నడుస్తున్న దాబా యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు. ఎవరైనా దాబాలో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామన్నారు.

## సినిమా గైడ్ కామారెడ్డి



| కామారెడ్డి | |
|---|---|
| శాంతి | - దేవర |
| దర్శన్ | - మార్టిన్, మా నాన్న సూపర్ హీరో |
| ప్రియా 35 | - విశ్వం |
| ప్రియా 70 | - విఠయన్ |

| బాన్సువాడ | |
|---|---|
| మహేశ్వరి | - దేవర |
| వెంకటేశ్వర | - మార్టిన్ |

## చికెన్ ధరలు



| రకం | : | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|---|
| సుగుణ (కిలో) | : | 140 | 180 | 200 |
| వెన్‌కాబ్(కిలో) | : | 130 | 160 | 190 |

